క్లుప్తంగా

స్వయం పాలన వేడుకలు



దుగ్గొండి : మండలంలోని మందపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. 10 ఏళ్లలోపు చిన్నారులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడం ఎంతగానో ఆకట్టుకుంది. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కర్ణకంటి రామ్మూర్తి, అప్పాల నిర్మల, యూసుఫ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



నర్సంపేట : నర్సంపేట పట్టణాభివృద్ధికి స్థానిక ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 13వ వార్డులో నూతన డ్రెయినేజీ పనులకు సోమవారం కౌన్సిలర్ రుద్ర మల్లీశ్వరిఓంప్రకాశ్‌తో కలిసి రజని శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో దాసరి నర్సింహారెడ్డి, కామని రవీందర్, ఆబోతు రాజుయాదవ్, బల్ల శివ, ప్రేమ్‌కృష్ణ, బల్ల సురేష్, నల్ల రవీందర్, యాకయ్య, అశోక్‌పాండ్య, ఠాకూర్ నాగరాజు సింగ్, వెంకటరామయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జోరు వీరయ్య, చెవ్వ వెంకటేశ్వర్లు, చిట్టె రవి సోమవారం మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కేసీఆర్ రాక్షస పాలన నుంచి విముక్తి పొందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని అన్నారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు.

ఎన్నిక



వర్ధన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల వర్ధన్నపేట యూనిట్ తెలంగాణ గవర్నమెంట్ కాలేజీ గెజిటెడ్, టీచర్స్ అసోసియేషన్ (టీజీసీజీటీఏ) ఎన్నికలు సోమవారం వర్ధన్నపేటలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో యూనిట్ అధ్యక్షుడిగా వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు బి.శ్రీనివాస్, కార్యదర్శిగా చరిత్ర అధ్యాపకుడు దొంతి శ్రీధర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రసాయనశాస్త్ర అధ్యాపకుడు వీరిచే ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను అధ్యాపకులు అభినందించారు.

పూర్వ విద్యార్థి ఔదార్యం



సంగెం : మండలంలోని మొండ్రాయి గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి తన ఔదార్యాన్ని చాటుకుంది. పాఠశాలలో ఐదో తరగతి చదివిన తూర్పాటి ప్రణీత తన తల్లిదండ్రులు మమత, సురేష్ ద్వారా పాఠశాలలోని విద్యార్థులు 56మందికి రూ.60 విలువైన పరీక్ష ప్యాడ్లు, 5వాటర్ క్యాన్లు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెరుగు మల్లేశం, ఎంపీటీసీ కొనకటి రాణి మొగిలి, ఎస్ఎంసీ చైర్మన్ వంగ మల్లేశం, ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు సుజాత, కమరున్నీసా పాల్గొన్నారు.

విరాళం

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని అనంతారం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి అబ్బరబోయిన లక్ష్మి-సాంబయ్యల కుమారుడు రేణుక-రవి సోమవారం రూ.2.11లక్షల 116(ధ్వజ స్తంభానికి గాను) అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకేరు వాగులో కోళ్ల వ్యర్థాలు



వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని కల్లెడ ఆకేరు వాగులో చికెన్ సెంటర్ నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను వదిలేస్తున్నారు. దీంతో కల్లెడ గ్రామంలోని ఆవాస ప్రాంత ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ఆకేరు వాగు సమీపంలోని రైతులు కోళ్ల వ్యర్థాల కారణంగా దుర్వాసన, క్రిమికీటకాలతో అనారోగ్యాలకు గురవుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు కోళ్ల వ్యర్థాలను వదిలి వెళ్లే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి



సంగెం: మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి



వర్ధన్నపేట: సభలో సమస్యలను వివరిస్తున్న ప్రజా ప్రతినిధులు

సంగెం : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ కళావతి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏఓ యాకయ్య మండలంలో ఇటీవల కురిసిన వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను సర్వే చేసి పంట నష్టపరిహారం కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు తెలిపారు. వచ్చే వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సంఘాల వడ్డీ రాయితీ, రుణాలు, ఉద్యానవన, పట్టు పురుగుల పెంపకం, మత్స్యశాఖ తదితర శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సభకు హాజరు కాకపోవడం మంచి పద్ధతి కాదని అందరు విధిగా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ కొమురయ్య, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వేసవి దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలి

వర్ధన్నపేట : ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా ప్రజా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ అన్నమనేని అప్పారావు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అప్పారావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా శాఖల ద్వారా మూడు నెలలుగా మండలంలోని చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతి నివేదికను సభ్యులకు వివరించారు. సభ్యులు గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇల్లంద హెల్త్ సబ్ సెంటర్‌లో కనీసం మందులు కూడా అందుబాటులో లేవని ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి ప్రచార పత్రిక ఆవిష్కరణ



పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

వర్ధన్నపేట : అంబేడ్కరిజం జేఏసీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 14న అంబేడ్కర్ జయంతికి సంబంధించిన ప్రచార పత్రికను ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆవిష్కరించారు. సోమవారం జేఏసీ నాయకులు హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి ఈ నెల 14న జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. అనంతరం పట్టణ కేంద్రంలో ఫంక్షన్ హాల్‌తో కూడిన అంబేడ్కర్ భవన్ నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ సమన్వయ కమిటీ సభ్యులు తుమ్మల యాకయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఐత ఎల్లయ్య, జేఏసీ కన్వీనర్ తుమ్మల శ్రీధర్, డాక్టర్ టీకే, తుమ్మల రమేష్, ప్రభాకర్, రవీందర్, భాస్కర్, రమేష్, సుధాకర్, సంపత్, కుమారస్వామి, రవి, శ్రావణ్, రాజు, ప్రశాంత్, మైబెల్లి తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నాయి..



వరి పంటను మేస్తున్న పశువులు

ఖానాపురం : ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పాకాలకు గోదావరి జలాలు తీసుకురావడంతో పూర్తిస్థాయిలో పంటల సాగు అయ్యాయి. ఆయకట్టు రైతులంతా పూర్తిస్థాయిలో పంటల సాగు చేస్తున్నారు. తుంగబంధం పరిధిలోని కొత్తూరు, రంగాపురం రైతులకు చెందిన పంటలకు నీరు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. అధికారుల నిర్లక్ష్య కారణంగా చివరి ఆయకట్టుకు నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయాయి. దీంతో చేసేదేమీ లేక పశువులతో మేపుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చివరి ఆయకట్టుకు నీరందించాలని అన్నదాతలు కోరుతున్నారు. అలాగే సంగెం పరిధిలోనూ పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరుగుదొడ్డి ఆత్మగౌరవ ప్రతీక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోమల

దుగ్గొండి : ప్రతి ఇంట్లో నిర్మించుకున్న మరుగుదొడ్లు ఆ ఇంటి మహిళలకు ఆత్మగౌరవ ప్రతీకలుగా నిలుస్తున్నాయని ఎంపీపీ కాట్ల కోమల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల వినియోగంపై సోమవారం ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మరుగుదొడ్లు నిర్మించుకున్న వారు ఒక గుంత తీసిన వారు మరో గుంత తీసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఇంకుడు గుంతలలో మట్టి కూరుకుపోతే వాటిని శుభ్రం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఇంకా గ్రామాలలో ఎవరయినా మరుగుదొడ్లు లేకుండా ఉంటే వారికి నూతనంగా మరుగుదొడ్లు మంజూరు చేస్తామని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఏపీఎం రాజు కుమార్, ఏపీఓ శ్రీనివాస్ , సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలు, గ్రామ సంఘాల బాధ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో శాంతి సమాజం



మొక్కులు చెల్లిస్తున్న ఉషాదయాకర్‌రావు

రాయపర్తి : ఆధ్యాత్మిక చింతనతో శాంతి సమాజం నిర్మితమవుతుందని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని తిర్మాలయపల్లిలో ఇటీవల నూతనంగా ప్రారంభించిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో 40రోజుల అనంతరం మండలాభిషేకం (తిరుగు పండుగ) పూజ కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

సన్మానం

నర్సంపేట రూరల్ : నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్‌యాదవ్‌ను గొర్రెల, మేకల పెంపకదారుల సంఘం(జీఎంపీఎస్) జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్ల మల్లయ్య శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పరిగి మధుకర్, కమిటీ సభ్యులు నాంచారి కుమారస్వామి, వడంల వంశీకృష్ణ, సుమన్, రాము, మల్లేష్, రమేష్, రాకేష్, రాజ్‌కుమార్, రాజమహేందర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్‌గౌడ్

రాయపర్తి : బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలతో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్లో చాటుదామని జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని మైలారం, మొరిపిరాల ఎంపీటీసీల పరిధిలో ఈ నెల 12న మంత్రి దయాకర్‌రావు ఆధ్వర్యంలో తలపెట్టిన ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పూస మధు, బాబు, ఉండటి సతీష్, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, పారుపెల్లి సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వల్లపు వెంకన్న, నాగపూరి అశోక్, వంశీధర్ రెడ్డి, నాగపూరి సోమన్న, లేతకుల మాధవ రెడ్డి, గబ్బేట యాకయ్య, పరుపాటి రవీందర్ రెడ్డి, ఊకోంగాల నర్సయ్య, చేగురి మల్లేష్, సర్పంచ్‌లు లేతాకుల యాదవరెడ్డి, అనిరెడ్డి యాకుబ్‌రెడ్డి, చెడుపాక కుమార్, వెంకట్రామ్, సజ్జన్, ఎంపీటీసీలు గాడిపెల్లి వెంకన్న, భూక్యా క్రాంతి, మండల పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ

వర్ధన్నపేట : ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ పంపిణీ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణ కేంద్రంలోని 11మంది బాధితులకు చెక్కులు మంజూరు కాగా ఆమె ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే ప్రతి ఒక్కరికి సీఎంఆర్ఎఫ్ వరంగా మారిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పులి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కొండగాని రాజేశ్ ఖన్నా, మార్కెట్ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు, రైతుబంధు కోఆర్డినేటర్ అల్లంనేని మోహన్‌రావు, కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, సిలువేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య, మార్త సారంగపాణి, ఐత ఐలయ్య, సంపత్, రాజు, లక్ష్మణ్, భాస్కర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు దక్కేవరకూ పోరాటం



కుంటపల్లిలో మాట్లాడుతున్న ఇస్మాయిల్

సంగెం : మండల పరిధిలో గల అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేవరకూ పోరాటం ఆగదని ఎంసీపీఐ(యు) మండల కార్యదర్శి ఇస్మాయిల్ అన్నారు. సోమవారం మండలంలోని కుంటపల్లిలో ముఖ్యకార్యకర్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను గుర్తించి ఇళ్లు లేని నిరుపేదలకు గుడిసెలు వేయడానికి ఎంసీపీఐ(యు) పూనుకున్నదని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కబ్జా కోరులకు ప్రభుత్వ యంత్రాంగం సహకరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వమే ఇళ్లు లేనివారికి స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో గోనె రాంచందర్, రౌతు శ్రీనివాస్, రేణుక, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలునుంచి జారిపడి వ్యక్తి మృతి



కృష్ణ (ఫైల్)

నెక్కొండ : రైలునుంచి జారిపడి ఒకరు మృతి చెందిన సంఘటన స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా గంగారం మండల కేంద్రానికి చెందిన తాటి కృష్ణ (32) గతంలో మిషన్ భగీరథ గూడూరు క్లస్టర్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించాడు. విధులపై నిర్లక్ష్యం, అతని ప్రవర్తన బాగోలేక విధులనుంచి తొలగించినట్లు సమాచారం. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి దూరం ఉంటున్నాడు. ఈ క్రమంలో రైలులో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు నెక్కొండ-ఇంటికన్నె కిలోమీటర్ నెంబరు 415/4-6 డౌన్‌లో రైలు నుంచి జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వరంగల్ రైల్వేస్టేషన్ డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని శవపంచనామా నిర్వహించారు. మృతుడికి తల్లిదండ్రులు లేరు. ఇద్దరు అక్కలు ఉండగా పోలీసులు సమాచారం అందించామన్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించామని తెలిపారు.

గీతకార్మికుడికి గాయాలు

వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తి గ్రామానికి చెందిన బత్తిని సాయిలు వృత్తిలో భాగంగా సోమవారం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకుజారి కింద పడ్డాడు. దీంతో సాయిలుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య



రాంబాబు(ఫైల్)

నర్సంపేట రూరల్ : ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సంపేటలోని ద్వారకపేట రోడ్డులో సోమవారం చోటు చేసుకుంది. నర్సంపేట ఎస్సై లక్ష్మి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట పట్టణానికి చెందిన మామిడాల రాంబాబు(39) నర్సంపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో టీ స్టాల్ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. పట్టణంలోని ద్వారకపేట రోడ్డులో భార్య రాధిక, కుమారుడు, కుమార్తెతో కలిసి ఉంటున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం రాధిక లేచి చూసే సరికి భర్త రాంబాబు ఇంట్లోని రేకుల షెడ్ పైప్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే రాధిక మామ కొమ్మాలుకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. భార్య రాధిక గొడవతోనే తన కుమారుడు రాంబాబు మృతిచెందినట్లు తండ్రి కొమ్మాలు ఫిర్యాదు చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు



దుగ్గొండి: మైసంపల్లిలో ఉత్తరాలు పంపుతున్న ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కోమల



నెక్కొండ: పోస్టాఫీస్‌లో ఉత్తరాలను పంపుతున్న బీఆర్ఎస్ నాయకులు, ఉపాధి కూలీలు

ఖానాపురం : ఉపాధిహామీ పథకంపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సరికాదని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని ధర్మరావుపేట, మంగళవారిపేట గ్రామాల్లో వేర్వేరుగా ఉత్తరయుద్ధం కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే రైతులకు లాభాలు ఉంటాయన్నారు. ఉపాధిహామీలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పద్ధతులతో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటనర్సయ్య, ఆర్‌బీఎస్ కన్వీనర్ వెంకట్ రెడ్డి, సర్పంచ్‌లు వెన్ను శృతిపూర్ణచందర్, లావుడ్య రమేష్, భూక్యా పద్మవెంకన్ననాయక్, మాజీ జెడ్పీటీసీ బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాల సందేశాలకు స్పందన

నెక్కొండ : మండలంలోని గుండ్రపెల్లి, మడిపెల్లి, నెక్కొండ గ్రామాల్లో చేపట్టిన ఉత్తర సందేశాలకు అనూహ్య స్పందన వస్తోంది. ఆయా గ్రామాల్లో కేంద్రం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలను నిరసిస్తూ కేంద్ర జాతీయ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రికి బీఆర్ఎస్ నాయకులు, ఉపాధి హామీ కూలీలు ఉత్తర సందేశాలను పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా నెక్కొండ పీఏసీఎస్ చైర్మన్ మారం రాము మాట్లాడుతూ.. వేల కోట్ల నిధులు, ఉపాధి కూలీల పని దినాలను తగ్గించడం, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలను కల్పించక పోవడం, కనీస వేతన చట్టాన్ని అమలు చేయక పోవడం దారుణమన్నారు. కొత్త నిబంధలతో కొర్రీలు పెట్టి పథకాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి, మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేవనబోయిన వీరభద్రయ్య, రామాల కమిటీ చైర్మన్ పాడిశెట్టి సత్యం, నాయకులు చల్లా కిషన్‌రెడ్డి, గరికపాటి కృష్ణారావు, రావుల నర్సింహరెడ్డి, తోట సాంబయ్య, ఈదునూరి యాకయ్య, వనం యాకాంతం, దుర్గాల కనకయ్య, డోలి రవి, తదితరులు పాల్గొన్నారు.

అనుసంధానించే వరకూ యుద్ధం ఆగదు

దుగ్గొండి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసే వరకు యుద్ధం ఆగదని జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. ఉత్తర యుద్ధంలో భాగంగా మండలంలోని మైసంపల్లి, ముద్దునూరు గ్రామాలలో కేంద్ర ప్రభుత్వానికి ఉత్తరాలు పంపే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకంపై కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాట్ల కోమల, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్ రావు, రంగారావు, సర్పంచ్‌లు రేవూరి సురేందర్ రెడ్డి, గంగారపు వనమాల, గ్రామ పార్టీల బాధ్యులు నాగరాజు, అజయ్, ఉప సర్పంచ్ నగేష్, వార్డు సభ్యులు, ఉపాధి కూలీలు, రైతులు పాల్గొన్నారు.

అనుసంధానం చేయాలి

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని రైతులు, మహిళలు కేంద్ర ప్రభుత్వానికి సోమవారం ఉత్తరాలు పోస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, సర్పంచ్ కుండె మల్లయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ, నాయకులు జున్నూతుల రాంరెడ్డి, కంది కృష్ణచైతన్య, మహేందర్ రెడ్డి, కుమారస్వామి, సతీష్, సురేష్, రైతులు, తదితరులు ఉన్నారు.

నల్లబెల్లిలో..

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెం, మామిండ్ల వీరయ్యపల్లి, కన్నారావుపేట గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఉత్తర ఉద్యమాన్ని చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు, రైతులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర మంత్రికి ఉత్తరాలు పోస్టు చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల కన్వీనర్ ఊడుగుల ప్రవీణ్ గౌడ్, నాయకులు కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, గందె శ్రీనివాస్ గుప్తా, కొత్తపల్లి కోటిలింగాచారి, ఇంగ్లే శివాజీ, మల్లాడి విజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ పద్మప్రసాద్

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని పదోవార్డుకు చెందిన లింగాల అనిల్(33) సోమవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతదేహంపై స్థానిక కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్ పూలమాల వేసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అనంతరం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మామిడాల భిక్షపతి, కీసరి వెంకటేశ్వర్లు, వలుస సత్యనారాయణ, నాగిశెట్టి ప్రవీణ్, ఆరెపెల్లి బాబు, పస్తం ఎల్లస్వామి, కృష్ణ, ముస్కు రాజేందర్, మారపెల్లి అశోక్, కొలువుల శ్యామ్, హరీష్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

చెన్నారావుపేట : మండలంలోని సూర్యపేట తండాకు చెందిన కాంగ్రెస్ వార్డు సభ్యుడు ధరావత్ మైబు ప్రమాదవశాత్తు బావిలో పడి ఆదివారం మృతి చెందాడు. కాగా మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన మంద చేరాలు తల్లి కొమురమ్మ ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా మృతదేహానికి సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్ సోమవారం నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు.

పాత శ్మశాన వాటికనే కేటాయించాలి



ఖానాపురం : మండల కేంద్రంలో పాత శ్మశాన వాటిక వినియోగించుకోవడానికి అనుమతించాలని తూనం స్వామి, నీలం సాంబయ్య, సత్యం, వీరాచారి కోరారు. ఈ మేరకు ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, సర్పంచ్ శాఖమూరి చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి సుప్రజలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన శ్మశాన వాటికకు వెళ్లాలంటే ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. గుండ్లబజార్ వైపు ఉన్న వారికి కొత్త శ్మశాన వాటికకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, జగన్నాథం, సాంబయ్య, నాగరాజు, మహేందర్, వెంకటయ్య, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

వంట పనుల్లో.. గురుకుల విద్యార్థులు



వర్ధన్నపేట : మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యార్థులతో హాస్టల్‌లో వంట పనులు చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో సోమవారం వైరల్‌గా మారింది. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలానికి కేటాయించిన బీసీ గురుకుల విద్యాలయం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి క్రాస్ వద్ద కొనసాగుతోంది. పాఠశాలలో విద్యార్థులతో వార్డెన్ కిచెన్ క్లీనింగ్, టిఫిన్(పూరి) తయారీతో పాటు పలు రకాల పనులు చేయిస్తున్నారన్న విజువల్స్ బయటకు వచ్చాయి. ఇవి కాక విద్యార్థులతో ఉపాధ్యాయులు తమ సొంత పనులు చేయించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. చదువుకోవాల్సిన విద్యార్థులు పనులు చేయడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై వివరణ కోరడానికి ప్రయత్నించగా అధికారులు అందుబాటులోకి రాలేదు.